క్లుప్తంగా

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

ఎస్ఎస్‌తాడ్వాయి: నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల కీలక పాత్ర కీలక పాత్ర పోషిస్తాయని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటులో భాగంగా గురువారం మండలంలోని నార్లాపూర్, కాటాపూర్ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం టెక్నీషియన్‌కు కాటాపూర్ గ్రామానికి చెందిన కమిటీ సభ్యులు రూ. 89వేలు, నార్లాపూర్ గ్రామానికి చెందిన కమిటీ సభ్యులు రూ. 60వేలు అడ్వాన్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో సీసీ కెమెరాలు చేసుకోవాలని అగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మొట్టమొదటిగా నార్లాపూర్, కాటాపూర్ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి



భూపాలపల్లి రూరల్: తపాలా శాఖ ద్వారా అందజేస్తున్న సేవలను ప్రజలందరూ వినియోగించుకుని లబ్ధి పొందాలని భూపాలపల్లి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ రామకృష్ణ సూచించారు. భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ పోస్ట్ ఆఫీస్‌లో తపాలా శాఖ పథకాలపై గురువారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అధిక వడ్డీ పొదుపు పథకాలు, సుకన్య, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఇన్సూరెన్స్ తదితర పాలసీల ప్రయోజనాలు వివరించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు పొదుపు మేలు చేస్తుందన్నారు. ఈ అవగాహన సదస్సులో ఏంఓ నరేష్ చా రి, ఎగ్జిక్యూటివ్ శ్రీకాంత్, బీపీఎంలు వెంకటేశ్, లక్ష్మీనారాయణ, రాజేశ్, యుగేందర్, శివరాం, ప్రశాంత్, వినయ్ శ్రీ రామ్, కోఆపరేటీవ్ సొసైటీ డైరెక్టర్ ఇట్టమళ్ల ఎసుమణి గ్రామస్తులు పాల్గొన్నారు.

బొగ్గులవాగు ప్రాజెక్టు నీరు విడుదల



మల్హర్: మండల పరిధి ఎడ్లపల్లిలోని భారీ మధ్య తరహా బొగ్గులవాగు ప్రాజెక్టు నీటిని మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, ఇరిగేషన్ అధికారులు గురువారం విడుదల చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎడ్లపల్లి, రుద్రారం, కొయ్యూరు, వల్లెకుంట కాటారం మండలంలోని విలాసాగర్, రేగులగూడెం, దామెరకుంట, దేవరాంపల్లి, గంగారం గ్రామాలకు చెందిన 5150 ఎకారాలకు సాగు నీరు అందుతుందని ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ రాజేష్, బడితెల రాజయ్య, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల జాతర



కాటారం: మండలంలోని గంగారంలో శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనం ఎత్తగా శివసత్తులు పూనకాలతో నాట్యమాడారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో కుటుంబ సమేతంగా అమ్మవారికి మొక్కులు సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి నైవేద్యం పెట్టారు. పంటలు సమృద్ధిగా పండి కుటుంబ సభ్యులు సంతోషంగా ఉండాలని వేడుకున్నారు.

దుస్తుల పంపిణీ

మహాముత్తారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను గురువారం పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మాచర్ల శైలజ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

రేగొండ: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్వేతను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిషిధర్‌రెడ్డి, పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఏడునూతుల విజేందర్‌రెడ్డి, లింగంపల్లి ప్రసాదరావు, నాయకులు గన్‌రెడ్డి లింగారెడ్డి, మెతుకుపల్లి బుచ్చిరెడ్డి, పెండ్యాల రాజు, నేరెళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



వెంకటాపురం(కె): పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



గోవిందావుపేట: ఎల్బీనగర్‌లో..

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎదిర వైద్యాధికారి రామ్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వీఆర్‌కేపురం, బెస్తగూడెం, ఓంటిమామిడి బీసీ మర్రిగూడెం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు కిరణ్, ఆశీష్, స్నేహ, సిబ్బంది జ్యోతి, మోహన్, యాకలక్ష్మి, రామకృష్ణ, కోటి రెడ్డి ఉన్నారు.

గోవిందరావుపేట: మండల పరిధిలోని ఎల్బీనగర్ గ్రామంలో గురువారం మండల వైద్యాధికారి డా.పోరిక చంద్రకాంత్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని 30 మందికి డెంగీ, మలేరియా, ఆర్డీటీ పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చిందని అన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సదానందం, హెల్త్ అసిస్టెంట్ జంపయ్య, ఏఎన్ఎం సరిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

మంగపేట: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రు పాలతో పాటు 06 నెలల వరకు కేవలం తల్లి పాలనే తాగించడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఏసీడీపీఓ ప్రేమలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలతో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వారి సూచనల మేరకు తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహ పద్ధతుల గూర్చి అవగాహన కల్పించారు. అనంతరం ప్రేమలత మాట్లాడుతూ.. బిడ్డకు తల్లిపాలు తాగించడంతో రోగనిరోధక శక్తి పెరిగి ఎలాంటి వ్యాధులు వచ్చినా తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ తుల రవి, మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి, నిఖిల్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, టీచర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, తల్లులు, గర్భిణులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



ఆటోను తనిఖీ చేస్తున్న ఎస్సై హరీశ్

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం వద్ద జాతీయ రహదారిపై ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ తనిఖీలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అందులోని బ్యాగులను సోదాలు చేశారు. ప్రత్యేకంగా ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న ప్రతీ వాహనాన్ని ఆపి సోదాలు చేయడంతో పాటు ప్రయాణికుల వివరాలను సేకరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



చిట్యాల: సమావేశంలో మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

టేకుమట్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా, మండల అధ్యక్షులు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, దేశెట్టి గోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుల నుంచి జెడ్పీటీసీ వరకు బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన బీజేపీ నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగంపెల్లి ప్రసాద్‌రావు, గుర్రపు నాగరాజు, బండారు సమ్మయ్య, శ్రీపతి రవి, కూర సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులు గెలిచి సత్తా చాటాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాన నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటింటికీ వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగపూరి రాజమౌళి, లింగంపల్లి ప్రసాద్‌రావు, చెక్క నర్సయ్య, జగ్గయ్య, అనిల్, కుమారస్వామి, మైదం శ్రీకాంత్, చింతల రాజేందర్, సుందర్, అజయ్, అశోక్‌చారి, సారంగపాణి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు కనీస వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న గొంది రాజేష్

ఏటూరునాగారం: ఆదివాసీలకు కనీస వసతులు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్ ప్రభుత్వాలను కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం నాయకుల సమావేశంలో రాజేష్ మాట్లాడారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులు నివారించేందుకు, ములుగు ఏజెన్సీ జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు దుగ్గి చిరంజీవి, జజ్జరి దామోదర్ రావు, జిల్లా కమిటీ సభ్యులు వంకా రాములు, కురుసం ప్రవీణ్, కోటి కృష్ణారావు, తోలం కృష్ణారావు, కుర్సం శాంత కుమారి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

మంగపేట: ఎస్సీ ఎస్టీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలే చేపట్టాలని గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆదివాసీ సంఘాల మండల జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. 30 ఏళ్ల నుంచి ఆదివాసీలు ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణతో పాటు ఎస్టీ వర్గీకరణ వెంటనే రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. దీనిపై త్వరలో ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర గవర్నర్, సీఎంలను కలవనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల జేఏసీ మండల అధ్యక్షుడు అంజయ్య, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్, మండల అధ్యక్షుడు ముత్యాలరావు, గోండ్వానా రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య, జేఏసీ చైర్మన్ తల్లడి నాగేశ్వర్ రావు, జేఏసీ వైస్ చైర్మన్ చాద మల్లయ్య, తాటి నాగరాజు, మడి శోభన్, నల్లెబోయిన లక్ష్మణ్‌రావు, పోలెబోయిన ఆదినారాయణ, తోలెం నర్సింహారావు, పాదెం రవీందర్ తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఎస్ఎస్ తాడ్వాయి: వెంకటలక్ష్మి కుటుంబానికి నగదు అందజేస్తున్న నాయకులు



కన్నాయిగూడెం: ఆర్థిక సాయం చేస్తున్న సహాయ నిధి సంస్థ సభ్యులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లంజపెల్లి నర్సయ్య తల్లి వెంకలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ నాయకులతో కలిసి పరామర్శించి రూ.8వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన రాదారపు సంజీవ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర, నాయకులు బండారి చంద్రయ్య, పల్నాటి సత్యం, పులి రవి, అనందం, మద్దూరి రాజు, పుల్లూరి నాగార్జున్, శ్రీను పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని సర్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని మల్కపల్లికి చెందిన పాదెం లక్ష్మయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ముప్పనపల్లి సహాయ నిధి టీమ్ ఆధ్వర్యంలో గురువారం రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందజేశారు. అబ్బు సతీష్, తిప్పనపల్లి విజయ్, రాజు, నామని రాజేష్, మురళి ఉన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం

కాటారం: మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్య సంబంధిత పలు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం జి.రవిశంకర్, వైద్యులు ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన ప్రాణహిత

కాళేశ్వరం: మహారాష్ట్రలో వర్షాలు తగ్గటంతో పట్టడంతో కాళేశ్వరంలో ప్రాణహిత నది ప్రవాహం తగ్గుముఖం పట్టింది. గురువారం కాళేశ్వరం వద్ద 7 మీటర్లకు చేరింది. దీంతో దిగువన మేడిగడ్డ(లక్ష్మీ)బరాజ్ వద్ద 3,62,685లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తరలి వస్తుంది. 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, అన్నారం బరాజ్ వద్ద 5,800వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో దిగువకు 66గేట్లు ఎత్తి నీటిని కాళేశ్వరం వైపునకు తరలిస్తున్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



మృతి చెందిన దుక్కిటెద్దు

ఏటూరునాగారం: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని శంకరాజుపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అత్కూరి లచ్చం దుక్కిటెద్దు కాష్టాలబోరు వద్దకు మేతకు వెళ్లింది. విద్యుత్ తీగలు మైదానంలో అప్పటికే తెగిఉండడంతో దుక్కిటెద్దు తీగలకు తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. దుక్కిటెద్దు విలువ రూ.60 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని రైతు వేడుకున్నారు.

దాతలు దయ చూపండి..

అంతుచిక్కని వ్యాధితో బాలుడి అవస్థలు ◆ ఆర్థిక సాయం అందించాలని తల్లిదండ్రుల వేడుకోలు

దీన గాథ



కాళ్లు చచ్చుబడి మంచానికి పరిమితమైన బాలుడితో తల్లిదండ్రులు

మంగపేట: ఆరు నెలల క్రితం వరకు బడిలో చదువుకుంటూ ఆడుతూ పాడుతూ చలాకీగా తిరిగే బాలుడిని అంతుచిక్కని వ్యాధి మంచానికి కట్టి పడేసింది. అల్లారు ముద్దుగా చూసుకునే ఒక్కగాని ఒక కొడుకు కళ్ల ముందు కాళ్లు చచ్చు పడి లేవలేని స్థితిలో మంచానికి పరిమితమై ఇబ్బంది పడుతుంటే తల్లిదండ్రులు తల్లడిల్లి పోతున్నారు. మండలంలోని పూరేడుపల్లి గ్రామంలోని నిరుపేద ఆదివాసీ గిరిజన తెగకు చెందిన కుర్సం ఆదినారాయణ, సమక్క దంపతుల కుమారుడు మహేందర్ గత ఏడాది 5వ తరగతి ముగిసే సమయంతో తీవ్రమైన జ్వరం వచ్చింది. దీంతో 15 రోజులు అయినప్పటికీ జ్వరం తగ్గక పోవడంతో ఏటూరునాగారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయినప్పటికీ నయం కాకపోవడంతో మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఎకరం పొలం రూ.50 వేలకు తనకా పెట్టడంతో పాటు వారికి ఉన్న మేకల మందను రూ.70 వేలకు విక్రయించారు. వచ్చిన డబ్బులతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చేతిలో ఉన్న డబ్బులు అయిపోవడంతో 20 రోజుల క్రితం వరంగల్ ఎంజీఎంలో చేర్పించారు. ఎంజీఎంలోనూ నయం కాకపోవడంతో బ్లెడ్‌ను టిస్టు కోసం హైదరాబాద్‌కు పంపించాం వారం రోజుల తరువాత రిపోర్టు వస్తుంది రిపోర్టు వచ్చిన తరువాత రమ్మని చెప్పి మూడు రోజుల క్రితం డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు. బాలుడు పడుతున్న బాధను చూసి తట్టుకోలేక ఏదైనా ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పిద్దామంటే డబ్బులు లేక నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారు. ఉన్న పొలం తనకా పెట్టామని, మేకల మందను అమ్ముకున్నామని కూలీకి పోతే తప్ప పూట గడవని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నామని వాపోతున్నారు. పెద్ద మనసుతో ఎవరైనా దాతలు దయ తలచి తమ కొడుకు ఆరోగ్యం బాగు పడేందుకు పెద్దాస్పత్రిలో చేర్పించేందుకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

బాలుడి తల్లి కుర్సం సమ్మక్క బ్యాంక్ అకౌంట్ నంబర్ 086612010002261 యూనియన్ బ్యాంక్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ 0808661కు లేదా ఫోన్ పే నంబర్ 70958 48189 ద్వారా దాతలు ఆర్థిక సాయం చేయాలని వేడుకుంటున్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



గొత్తికోయలతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: గొత్తికోయలు మావోయిస్టులకు సహకరించొద్దని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాల్వపల్లి, జలగలంచ గొత్తికోయగూడెంలలో ఎస్సై గురువారం తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. మవోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, జలగలంచగూడెంలో గొత్తికోయలకు సైబర్ నేరాలపై ఎస్సై అవగాహన కల్పించారు. ఆయన వెంట సీవిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



సాయం అందజేస్తున్న సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలి రోడ్డున పడ్డ కుటుంబానికి పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ గురువారం నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. వివరాలలోకి వెళ్లితే.. పస్రా గ్రామ పంచాయతీలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన పిట్టల నర్సయ్య ఇల్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న పస్రా సీఐ, ఎస్సైలు తమ వంతుగా కొంత నగదుతో పాటు, నిత్యావసర సరుకులు అందించారు.

వేతనాల పెంపుపై హర్షం



సీఎం, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కళాకారులు

కాటారం: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు 30 శాతం పీఆర్సీ అమలు చేయడంతోపాటు వేతనాలు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాటారం మండల కేంద్రంలో గురువారం కళాకారులు సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా పలువురు కళాకారులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సేవలను గుర్తించడం సంతోషకరమన్నారు. వేతనాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కళాకారులు ఒనపాకల కుమార్, ప్రవీణ్‌కుమార్, మహేందర్, శంకర్, సురేందర్, శిరీష, సుమలత, మధుబాబు, రాధిక, నాగమణి, స్వాతి పాల్గొన్నారు.

'చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి'

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మిరాజయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని, పెసా చట్టాలను అమలు చేయాలని అన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలను ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం రామచందర్, పర్షిక సతీష్, తాటి లక్ష్మణ్, తుర్స చంటి, కృష్ణబాబు, కుంజా మహేష్ ఉన్నారు.